నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
మంగళవారం | ఏప్రిల్ 01, 2025 | www.navatelangana.com

ప్రభుత్వ పాఠశాలలో శుభ్రత కార్యక్రమం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మహాత్మాగాంధీ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-4 నాలుగవ రోజులో భాగంగా అన్నెపర్తి గ్రామములోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో చెట్లకు పాదులు తీసి పాఠశాలలోని వంటగది చాలా రోజులుగా దీనస్థితిలో ఉండగా దానిని శుభ్రం చేశారు. పగుళ్లు ఉన్న చోట కంకర, ఇసుకతో కాంక్రీట్ చేశారు. అలాగే రంజాన్ వేడుకలు చేసుకున్నారు. తదనంతరం రైల్వేస్టేషన్‌ను శుభ్రపరిచారు. బాణాల సత్తిరెడ్డి పాల్గొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బొడ్డు వీరస్వామి, వాలంటీర్స్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి ఉగాది కవి పురస్కారం

నవతెలంగాణ-చండూర్



ప్రముఖ రచయిత ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఉగాది కవి పురస్కారం అందుకున్నారు. ఉగాది సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సాహితీ మేఖల ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని కవిత గానం చేసినందుకు గాను మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు చరణ్ అర్జున్ చేతుల మీదుగా ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి, పురుషోత్తమాచార్య, నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి, పున్న అంజయ్య, పెందోట సోము తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ-2024 బిల్లుతో మతపరమైన హక్కులకు భంగం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సయ్యద్‌హాషం

నవతెలంగాణ-క్లాక్‌టవర్



నల్లగొండలో...

వక్ఫ్ సవరణ 2024 బిల్లుతో మైనార్టీల మతపరమైన హక్కులకు భంగం కలుగుతుందని, ఈబిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సయ్యద్‌హాషం అన్నారు.ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నల్లగొండ ఈద్గా ప్రార్థన స్థలం దగ్గర నల్లరిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీంతో కలిసి మాట్లాడారు. ఈ సవరణ బిల్లు మతపరమైన హక్కులకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ఆస్తుల రక్షణకు విఘాతం కలిగిస్తుందన్నారు. వక్ఫ్ స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. వక్ఫ్‌సవరణ బిల్లు -2024ను ఆగస్టు 8 2024 రోజున పార్లమెంట్‌లో లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ సవరణ బిల్లు జాయింట్ పార్లమెంటు కమిటీకి పంపిందన్నారు. మొత్తం 31 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజల అభిప్రాయాలు సేకరించిందని పేర్కొన్నారు.ఐదుకోట్ల మంది బిల్లులోని సవరణలు వ్యతిరేకిస్తూ జాయింట్ పార్లమెంట్ కమిటీకి వినతులు సమర్పించారని గుర్తు చేశారు. ఈ కమిటీ 421 పేజీల నివేదికను 13 ఫిబ్రవరి 2025న లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశపెట్టిందన్నారు. బిల్లుకు ప్రతిపాదించిన మొత్తం 44 సవరణలలో 14 సవరణలు స్వల్ప మార్పులు చేస్తూ జాయింట్ పార్లమెంట్ కమిటీ ఆమోదించిందని తెలిపారు.ప్రతిపక్ష ఎంపీలు ఈ సవరణలను వ్యతిరేకిస్తూ ఇచ్చిన అసమతులను రిపోర్ట్ నుంచి తొలగించారని, ప్రతిపక్ష ఎంపీలు ఉభయసభల్లో గట్టిగా నిలదీయడంతో అసమ్మతులను తిరిగి చేర్చారన్నారు.ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లుకు ఓటింగ్‌కు రాబోతుందన్నారు. ఓటింగ్‌లో ఈ బిల్లు నెగ్గితే రాష్ట్రపతి సంతకంతో ఇక చట్టంగా మారనుందన్నారు.స్వాతంత్ర్యం తర్వాత 1954లో తొలిసారి వక్ఫ్ నియమ నిబంధనలు ఏర్పడ్డాయన్నారు. సంక్షేమ కార్యకలాపాల కోసం ఒక సంస్థకు ఇచ్చే బహుమతి లేదా దానం అని అర్థమన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌చట్టానికి సవరణలు చేస్తున్నదని, ఆస్తులను రక్షించడం కోసం కాదని స్పష్టం చేశారు. ఈ ఆస్తులను ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని కుట్ర చేస్తుందని విమర్శించారు.ఒక బోర్డ్ పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కార్పొరేట్లకు, శ్రామికవేత్తలకు కట్టబెట్టడం కోసం కుట్రలో భాగమేనని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు ఊట్కూరి మధు సూదన్‌రెడ్డి, ఎక్బాల్, సాజిద్, మైనార్టీ నాయకులు, అడ్వకేట్ నజీరుద్దీన్, కనగల్ మాజీ ఎంపీపీ కరీంపాషా, మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్, ఖలీల్, ఎక్బాల్, అజీజ్, సోయబ్, అఖిల్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : చండూరు మున్సిపల్ పట్టణంలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిములు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.అనంతరం మత గురువు ముజాహిద్ మాట్లాడుతూ దివ్య ఖురాన్ ముస్లింల పవిత్ర గ్రంథం అని, ఈ మాసంలో ఆవిర్భవించిందన్నారు. నంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, నల్లగంటి మల్లేశం, గండూరి జనార్ధన్, కమ్రుద్దీన్, కరెంటు షరీఫ్ పాష, ఎండి.నిరంజన్‌అలీ (లైన్‌ఇన్‌స్పెక్టర్), సయ్యద్ జావిద్, జిన్నా, లతీఫ్, షబ్బు పాష, ఎజాస్,ఖలీల్, రహీం బాబా,హైమద్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన దైద రవీందర్

నవతెలంగాణ-నకిరేకల్



పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ నాయకుడు మహమ్మద్ యూసుఫ్ మంత్రి వెంకటరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాద లింగస్వామి గౌడ్, చెరుకు యాదగిరి, సతీష్, రాజశేఖర్, నాగరాజు, మహేష్, గిరి ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధం



- మంటలు ఆర్పిన ఫైరింజన్
- రూ.5 లక్షల వరకు నష్టం
- ప్రభుత్వమే ఆదుకోవాలి: బాధితుడు రైతు సల్లా కొండలు

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో రైతు సల్లా కొండలు బత్తాయి తోట వల్ల అధిక దిగుబడి వస్తున్నాయని తన మూడున్నర ఎకరాలలో బత్తాయి తోటను గత ఎనిమిదేండ్లుగా సాగు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం షార్టు సర్క్యూట్‌తో మోటర్ వద్ద మంటలు వ్యాపించి చేతికి అందిన ఎకరం బత్తాయి తోట దగ్ధం అయ్యింది. వెంటనే హాలియా ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయడంతో ఆదివచ్చేలోపే 120 చెట్లు కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ మంటలు ఆర్పడంతో ఎలాంటి ఎక్కువ నష్టం జరుగలేదు. పక్కనే వున్న రైతుల తోటలకు కూడా మంటలు వ్యాపించి భారీ నష్టం జరిగేది కాని ఫైర్ ఇంజన్ త్వరగా రావడంతో తోటలకు ఎక్కువ ప్రమాదం జరుగ లేదు. పంట కోసి మోటర్లకి ఎరువులకి చేసిన అప్పు తీర్చొచ్చు అనుకున్న రైతు సల్లా కొండలుకు కన్నీరు మిగిలింది. ఎకరం బత్తాయి తోట మొత్తం కాలిబూడిదైంది. ఒక్క రూపాయి కూడా చేతతికందకుండా రైతు నష్టపోయాడు. ఘటనకు సంబంధించి ఐదు లక్షల నష్టం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. రైతు సల్లా కొండలు గతంలో పొలంలో బోర్లు వేసి నీరు పడక నష్టం వచ్చి ఎకరం భూమిని అమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఘట న జరగడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా బాధిత రైతు పరిస్థితి అయింది. పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. నష్టాల్లో ఉన్న రైతును ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు సల్లా కొండలు గ్రామస్తులు కోరారు.



ప్రజానాయకుడి పేరుతో ప్రజలకు దాహం తీర్చేందుకే చలివేంద్రం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అమరజీవి కల్లూరి యాదగిరి జ్ఞాపకార్థంగా కుటుంబసభ్యులు చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీమణి కల్లూరి యాదమ్మ మాట్లాడుతూ చెరువుగట్టు దేవస్థానానికి నిత్యం ప్రజలు తిరుగుతుంటారని, వేసవికాలం ప్రారంభమైనందున ప్రజల దాహం తీర్చేందుకు తన భర్త జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు.ఆయన జీవితం నిత్యం ప్రజలకే అంకితం చేశారన్నారు.ఆయన మరణం తర్వాత కూడా ప్రజల గుండెల్లో చిరకాలం నిలుస్తాడన్నారు. తన వంతుగా ప్రజలకు ఎల్లవేళలా తన భర్త ఆశయాల కోసం సేవ చేస్తానన్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చింతపల్లి బయన్న మాట్లాడుతూ కల్లూరి యాదన్న జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ప్రారంభించడం మంచి పరిణామమన్నారు.ఆయన పేరుతో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం, ఆయన బతికుండగా కూడా నిత్యం ప్రజల కోసం, పార్టీ కోసం పాటుపడేవారన్నారు.ఆ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండదండగా నిలుస్తుందని, ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమారులు కల్లూరి సుందర్, కల్లూరి కిరణ్, కూతురు అరుణ, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు చెరుకుపెద్దులు, దండు రవి, బొల్లెద్దు సైదులు, శాఖ కార్యదర్శులు దండు నాగరాజు, శ్రీను, దండు శంకర్, శంకరయ్య, బొడ్డుపల్లి హుస్సేన్, భాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ జీవితాన్ని అధ్యయనం చేయాలి



నవతెలంగాణ-నకిరేకల్

ప్రజల జీవితాన్ని అధ్యయనం చేయడం, ప్రజలను దగ్గరగా విద్యాలక్ష్యాలతో అను సంధానించి పరిశీలించడం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ద్వారా దొరికిన అవకాశమని, ఓగోడు గ్రామాన్ని పూర్తిగా విద్యార్థులు అధ్యయనం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.బెల్లి యాదయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఓగోడు గ్రామంలో ప్రత్యేక సేవాశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవ, అధ్యయనం, అవగాహన అనే త్రిగుణాత్మక కార్యాల ద్వారా వాలంటీర్లు గ్రామం నుంచి ఎన్నో విలువైన విషయాలను నేర్చుకోవాలని, గ్రామీణ సమస్యల పరిష్కారానికి పరిశోధనా పత్రాలను రూపొందించాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే.హరిత, అధ్యాపకులు శ్రీనివాసాచారి, డా.శంకర్, శ్రీను, సతీష్, శివశంకర్, నర్సింహాచారి, గ్రామపెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పొడుపుగంటి వేణుగోపాలరావు మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన పొడుపు గంటి వేణుగోపాలరావు అనా రోగ్యంతో మృతి చెందారు. సోమ వారం ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్న రాజ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య వేర్వేరుగా సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు.కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

రంజాన్ పండుగ శుభాకాంక్షలు



- మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకొని నల్గొండ పట్టణంలోని పలువురు ముస్లిం సోదరుల నివాసాలకు, మత పెద్దల వద్దకు వెళ్లి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డిని సాదర పూర్వకంగా ఆహ్వానించి ఆత్మీయ ఆలింగనం చేసుకొని స్వీట్లు తినిపించారు. అల్లా దేవుడు అందర్నీ చల్లగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిరంజన్ వలి, మున్సిపల్ మాజీ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్,జమాల్ ఖాద్రి, మాజీ కౌన్సిలర్, మారగోని గణేష్, రావుల శ్రీనివాసరెడ్డి, మెరుగు గోపి, రేగట్టె మహేందర్‌రెడ్డి, సురేష్ రెడ్డి, సయ్యద్ జాఫర్,మౌలానా బషీర్,అబ్రార్ ,మైనారిటీ విభాగం అధ్యక్షులు, అన్వర్‌పాషా,సోహెల్, శంషోద్దిన్, నకి పాషా, నూర్, ఓవైస్, అన్సారీ, ఫర్హాన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: కుల మతాలకతీతంగా సోదర భావంతో



మిర్యాలగూడ...

పండుగలు జరుపుకోవాలని ఎన్‌బిఆర్ ఫౌండేషన్ చైర్మెన్ నల్లమోతు సిద్ధార్థ కోరారు. అపోలో రీచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక బంగారిగడ్డ ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు మంచినీళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి వారికి సహాయ పడాలనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. సంస్కృతి సాంప్రదాయాలను ఒకరికొకరు గౌరవించుకోవాలని కోరారు. కార్పొరేట్ వైద్యం తక్కువ ఖర్చుతో పేదలకు అందించేందుకు అపోలో రీచ్ ఆస్పత్రి ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మాక్దుం పాషా, మున్సిపల్ మాజీ ఫ్లో లీడర్ ఎండి ఇలియాజ్, బాలేషహీద్, హబీబ్, బుల్లెట్ బాబా, ట్రాలీ రహమాన్ తిరునగర్ అభి తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర రంజాన్ పండుగ వేడుకలు సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. మిర్యాలగూడ డివిజన్‌లోని అన్ని మండల కేంద్రాలలో ఈద్గాల వద్ద సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ పాత ఈద్గా, రైల్వే స్టేషన్ అవంతిపురం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు ముస్లిం సోదరులకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎన్.బి.ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ నల్లమోతు సిద్ధార్థ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. జన మైత్రి ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు చల్లటి మంచినీళ్లు అందించారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా వక్ఫ్ బోర్డు బిల్లు నిలిపివేయాలని ముస్లిం సోదరులు చేతికి, జేబుకు నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనంగా ప్రత్యేక ప్రార్థనలలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, పొదిలా



మిర్యాలగూడ...

శ్రీనివాస్, చిరుమర్రి కృష్ణయ్య, చిలుకూరి బాలు, తలకొప్పుల సైదులు, మొయిజ్, జాని బి ఆర్ ఎస్ నాయకులు తిప్పన విజయ సింహారెడ్డి, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మక్దుం పాషా, ఇలియాజ్, హబీబ్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్...


నకిరేకల్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నోముల గ్రామపంచాయతీ పరిధిలో గల ఇస్లాంపూర్, నకిరేకల్ పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించడమన్నది గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వంటిపాక వెంకటేశ్వర్లు నాయకులు ఎర్రుల తాజేశ్వర్, వంటేపాక కృష్ణ గుసుగుంట్ల బుచ్చి రాములు పాల్గొన్నారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్న రాజ్, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు, చెరుకు వెంకటాద్రి, చౌగొని శంకర్, మిధున్ తదితరులు పాల్గొన్నారు.



కేతెపల్లి...

కేతెపల్లి: ముస్లిం మత స్థాపకుడు మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆదర్శనీయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్ అన్నారు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో ఈద్గాలో నమాజ్ (ప్రార్థన) పాల్గొని నకిరేకల్ నియోజకవర్గ ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు



పెద్దవూర...

గార్లపాటి రవీందర్‌రెడ్డి, మౌలానా, నజీరుద్దీన్, రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ యుసుబ్ జానీ, మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, ఎండి నాదం, హఫీస్, నిజాముద్దీన్, రఫీ, జావిద్, జానీ పాషా, అల్తాఫ్, కలీం, పాల్గొన్నారు.

మండలంలోని వివిధ గ్రామాల్లోని ముస్లిం ప్రజలు ప్రత్యేక ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని గుడివాడ కొత్తపేట, కాసనగోడు, చెరుకుపల్లి, భీమారం, తుంగతుర్తి, కొర్లపాడు గ్రామాల్లో ముస్లిం మత పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడివాడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మాజీ సర్పంచ్ షేక్ లతీఫ్, కొర్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండి యూసఫ్ జానీ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దవూర: భక్తి శ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు ముగించుకుని ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ నా శుభాకాంక్షలు. అల్లా చూపిన మార్గంలో నడవాలని, అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ బుసిరెడ్డి పాండు రంగారెడ్డి ఆకాంక్షించారు.

తిరుమలగిరిసాగర్: నెల రోజులపాటు కఠోర ఉపవాసాలు, ఖురాన్



తిరుమలగిరిసాగర్....

శ్లోకాలను ఆలపిస్తూ ప్రత్యేక తరావీ నమాజులు చేసిన తిరుమలగిరి ముస్లింలు సోదరులు సోమవారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆకాశంలో చంద్రవంక దర్శనం ఇవ్వడంతో రంజాన్ పర్వదిన వేడుకలకు సన్నద్ధమైన ముస్లింలు సోమవారం తెల్లవారుజామున 5.15 గంటలకు ఫజర్ నమాజ్‌తో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను ప్రారంభించుకున్నారు. ముస్లిం కుటుంబాలన్నీ వేకువజామునే నిద్ర లేచి ఇళ్లు, వాకిళ్లను శుభ్రం చేసుకుని తలంటు స్నానాలు చేసి నూతన దుస్తులు ధరించి పాలు, సేమియా, డ్రైఫూట్స్‌లతో ప్రత్యేక సేమియా వంటకాలను తయారు చేసుకొని బంధుమిత్రులకు పంచుతూ వేడుకలు చేసుకున్నారు. అనంతరం బడాయిగడ్డ వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు మత గురువులు చేసిన ఖుద్బా ప్రసంగాలను ఆలకిస్తూ ప్రత్యేక నమాజులు ఆచరించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఖబ్రస్థాన్లకు చేరుకుని గతించిపోయిన తమ పూర్వీకుల సమాధులపై పూలుచల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ నెంబర్ రహీం. ఇమామ్ సాబ్ షేక్ నసీరుద్దీన్ ,ఎండి సుభాని,ఎస్కే ఇబ్రహీం. హైమద్ ,యాసిన్, అక్రమ్ ,కమాల్, బాసుమియా, ముస్తఫా,అలి బాబు, షరీఫ్ హమీద్ ,సమీర్ ,ముస్తఫా, ఇబ్రహీం, సాదిక్ ,రహీం , అక్బర్, చాంద్ పాల్గొన్నారు.

తుల్జా భవాని వేడుకలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



మిర్యాలగూడ మండల పరిధిలోని జంకుతండ గ్రామ పంచాయతీలోని మాలోత్ తండ, జంకుతండలో ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుండి రెండు యాటలను తుల్జా భవాని, మెరమ్మ యాడిలకు బలి ఇచ్చి దేవతలకు నైవేద్యం సమర్పించారు. దీంతో గత రెండు రోజుల నుండి పండగ సందడి నెలకొన్నది. కుటుంబ సభ్యులు, బందు మిత్రులతో తండాలో అనంద వాతావరణం నెలకొన్నది. పూజ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, గోవర్దన్, దేవూజ, గణేష్, బిక్కు, భీమ్లా, పూజారులు శ్రీరాములు, పాండు, దాస్య, జబ్బార్, రవీందర్, శంకర్, మంగా, బాల, రమేష్, బాలోజీ, చేన, నాగు, భద్రు, పాండు, మక్ల, వెంకటేశ్వర్లు, పూల్సింగ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీఓ మృతి



నవతెలంగాణ-మునగాల

మండల ఎంపిఓ దారా శ్రీనివాస్ (50)సోమవారం అకస్మికంగా మృతి చెందారు. ఆయన చిలుకూరు మండలం జెర్రి పోతులగూడెంలో తన మిత్రుడు ఇంట్లో జరిగే రంజాన్ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్ళారు. అదే సమయంలో టాయిలెట్ వెళ్ళివస్తానని చెప్పి అంతలోనే కుప్ప కూలీ పోయాడు. మృతుడిది గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామం. అయితే ఆయన కొంత కాలంగా కోదాడలో నివాసం వుంటున్నారు. జిల్లాలోని నాగారంలో ఆయన కొన్నాళ్ళ పాటు ఇన్‌చార్జి ఎంపిడిఓగా పనిచేశారు. ఆరు నెలల క్రితం బదిలీపై మునగాలకు వచ్చారు. మృతునికి భార్య ఇద్దరు ఆడ పిల్లలు వున్నారు. ఆయన అకాల మృతికి మునగాల ఎంపిడిఓ రమేష్ దీన్ దయాల్, కార్యాలయ సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేశారు.

సాగర్ నీటిని ఏప్రిల్ 15 వరకు ఇవ్వాలి

నవతెలంగాణ-చిలుకూరు

ఏప్రిల్ 15 వరకు సాగర్ నీటిని విడుదల చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాగటి రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వరి పంటలు చివరి దశలో ఉన్నందున సాగర్ నీటిని యథావిధిగా కొనసాగించాలన్నారు. ప్రస్తుతం కొంతమంది రైతులు సాగర్ కెనాల్‌కు ముందుగా ఉండడంతో ముందుగా నాట్లు వేయడంతో కోతకు రాగా మరి కొంతమంది రైతులు 15 రోజుల వ్యవధిలో నాట్లు వేయడంతో వరి కోతకు రావడానికి ఇంకా 15 రోజులు సమయం పడుతున్నందున ఏప్రిల్ 15 వరకు సాగర్ నీటిని విడుదల చేయాలన్నారు. లేనిచో 60 శాతం మంది రైతులు తమ పంట పొలాలను చేతికి అందే సమయంలో నిట్ట నిలువునా ఎండిపోతాయని లబోదిబోమంటున్నారు. విషయాన్ని రైతులు పైస్థాయి అధికారులకు తెలియజేసినప్పటికీ సాగర్ నీటిని బందు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని పరిగణలో తీసుకొని ఏప్రిల్ 15 వరకు సాగర్ నీటిని కొనసాగించాలని ఆయన అన్నారు.

పాతకార్డులో పేరులేదు.. కొత్తది రాకపాయె !



- రాజీవ్ యువ వికాసం పథకానికి అడ్డంకిగా మారిన రేషన్ కార్డ్
- కొత్త కార్డుల కోసం పాతకార్డులో పేర్లను తొలగించుకున్న యువత
- ఏండ్లుగా కొత్త రేషన్‌కార్డులకోసం ఎదురు చూపులు
- రేపు మాపంటూ కాలమెళ్లదీస్తున్న ప్రభుత్వం
- రేషన్ కార్డు లేక అనేక సక్షేమ పథకాలు కోల్పోతున్న అర్హులు



నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ కార్డు నిబంధన లబ్ధిదారులకు పెను ఆటంకంగా మారింది. గత పది సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డులు రాక కొత్తగా దరఖాస్తు దారులందరికి ఎప్పుడు వస్తాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా యువత రేషన్ కార్డు నిబంధన తీవ్రఆవేదనకి గురిచేస్తుంది. కొత్త రేషన్ కార్డులు గత మూడు నెలలుగా ప్రజా ప్రభుత్వం అందిస్తామని చెప్తున్నా ఇంతవరకు ఆ ఉసే లేదు. ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించినట్లు, అందుతాయో లేదో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. రేషన్ కార్డు లేకపోతే రాజీవ్ యువ వికాసానికి ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదు. ఆన్లైన్లో ఆధార్ కార్డు నెంబర్ టైప్ చేయగానే ఆటోమేటిగ్గా రేషన్ కార్డు నెంబర్ కూడా కనిపిస్తుంది. దీనికి ప్రభుత్వం ఇస్తాను అని చెప్తున్న రాజీవ్ యువ వికాసం పథకం అందిస్తామని కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమే గాక రేషన్ కార్డు ఉంటేనే పథకానికి అర్హులని సర్కారు షరతులు విధించడమే అందుకు కారణం అవుతుంది. ఈ పథకానికి సంబంధించి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు స్వీకరించి జూన్ 2 లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తామని సర్కారు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. కొత్త రేషన్ కార్డులు ఈనెల అందితే అర్హులకు చాలా మందికి ప్రజల ఉపయోగకరంగా ఉండే అవకాశం ఉంది. గత పది రోజుల నుండి దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. కానీ చాలామంది దీనికోసం అప్లై చేసుకోలేక పోతున్నారు. అందుకు కారణం రేషన్ కార్డులు, రేషన్ కార్డులో పేరు లేని వారు దీన్ని అనర్హులా ? అర్హులా అన్నది ప్రభుత్వం ప్రకటించాల్సిన అవసరం ఉన్నది. కొత్త కార్డు కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు. డిఎస్ఓ పెండింగ్ ఉండడంతో దీంతో చాలామంది నష్టపోతున్నారు. తహసీల్దార్ కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చాలామందికి పెళ్లిళ్లు అయ్యాయి. కళ్యాణ లక్ష్మీ పథకాన్ని సైతం అందుకున్నారు. దీంతో నూతన జంట కొత్త రేషన్ కార్డులు రావడం కోసం తమ కుటుంబాలలో రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం అప్లై చేశారు. కానీ అవి ఇప్పటివరకు రాలేదు. గత ప్రభుత్వంలో వీటి ఊసే లేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. మళ్లీ మీ సేవ కేంద్రం ద్వారా అప్లై చేసుకునే వెసులుబాటు కల్పించింది. కానీ కొత్త కార్డు ఇంకా జారీ చేయలేదు. దీంతో అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు పొందలేకపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 10 సంవత్సరాల కాలం నుంచి కొత్త రేషన్ కార్డులు అందించకపోగా చేర్పులు మార్పులు నోచుకోని పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి హామీ ఇచ్చినా ప్రకటనలే తప్ప సరైన స్పష్టత ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పాత రేషన్ కార్డులు పేరు డిలీట్ కావడంతో ప్రభుత్వం అందించే సీఎం ఆర్ ఎఫ్ ఆరోగ్యశ్రీ ఇందిర ఇండ్లు రాజీవ్ యువ వికాసం పథకాలు పొందలేకపోతున్నామని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు ఉన్న పేదలు ప్రభుత్వం పథకాల సద్వినియోగం చేసుకుంటున్న కార్డు లేని పేదల సంగతి ఏమిటనే ప్రశ్నా పెన్ సవాల్ గా మారింది. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా కనీసం ఆ కార్డులో మార్పులు చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు నష్టపోతున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-తిరుమలగిరి

పట్టణ కేంద్రంలో సోమవారం ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్ పట్టణ కేంద్రంలోని ఈద్గా దగ్గర ముస్లిం సోదరుల ప్రార్థన అనంతరం వారిని అలింగనం చేసుకుని వారందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసినారు. వారు మాట్లాడుతూ రంజాన్ మాసం ఆధ్యాత్మిక భక్తికి స్వీయ క్రమశిక్షణకు ఉత్తమ సమయంగా భావిస్తారని సమాజంలో కృతజ్ఞత ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేద ప్రజలను ఆదుకోవడానికి వారికి దానం చేయడానికి కోపాన్ని నిగ్రహించుకోవడానికి ఈ రంజాన్ పండుగ జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల శ్రీను, కొంపల్లి రాముగౌడ్, మార్కెట్ డైరెక్టర్ రాపాక సోమేష్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోండ్ల వంశీ, 14వ వార్డు ఇంచార్జ్ పత్తేపురం సుధాకర్, కాంగ్రెస్ నాయకులు మాసంపల్లి మోహన్, బేతు లింగయ్య, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



కోదాడటౌన్:

అల్లా ఆశీస్సులతో సమాజంలో శాంతి సామరస్యాలు ఐక్యత సోదర భావాలు పెంపొందాలని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ ఖాదీర్ రషాదీ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఈద్గాలో రంజాన్ పర్వదినం సందర్భంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. రంజాన్ మాసం లో ఆచరించిన ఉపవాస దీక్షల స్ఫూర్తితోనే అందరూ తమ జీవితాన్ని పరిపూర్ణంగా గడపాలన్నారు. దివ్య ఖురాన్ ఆవిర్భవించిన మాసం రంజాన్ మాసం అని రంజాన్ మాస దీవెనలు ప్రజలందరికీ కలగాలన్నారు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షకులకు మతాలకు కులాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాల నింపాలన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు.

ఈద్గా వద్ద రాజకీయ పక్షాల ... రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు

కోదాడ పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలో ఉన్న ముస్లిం సోదరులకు కాంగ్రెస్ బీఆర్ఎస్ బిజెపి సిపిఎం తదితర రాజకీయ పక్షాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మహబూబ్ జానీ, ఎర్నేని బాబు,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు షేక్ నయీమ్, బొలిశెట్టి కృష్ణయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి :

మండలంలోని పెదవీడు గ్రామంలో ముస్లింలు సోమవారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను ఘనంగా జరుపుకున్నారు.మౌలానా అబ్దుర్ రహీం,మౌలానా షకీల్ లు మాట్లాడుతూ రంజాన్ పండుగ అంటే పేదల ఆకలి బాధలు తెలుసుకొనే పండుగ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల మీద కక్ష కట్టి పర్సనల్ చట్టాల్లో తల దూర్చి ట్రిపుల్ తలాఖ్, వక్ఫ్ బోర్డు మీద పెత్తనం చెలాయించే విధంగా నల్ల చట్టాలను తెస్తూ లౌకిక వాదం మీద దాడి చేస్తూ రాజ్యాంగాన్ని అపహస్యం చేస్తున్నదన్నారు.దానికి నిరసనగా నల్ల రిబ్బన్ ధరించి ఈద్గా లో రంజాన్ పండుగ నమాజ్ కి హాజరు అయ్యామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ వాహబ్, కరీం, మదార్ సాహెబ్,హఫీజ్ ఇమామ్ అలి, రజ్వీ, ఖాజా, రీజ్వాన్, అబుషా అహ్మద్, మగ్బుల్, ఉస్మాన్, కలిం, షరీఫ్ ,మీరా, ముహమ్మద్ , అజహర్,యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్:

పవిత్ర రంజాన్ మాసం చివరి రోజున పట్టణంలోని ముస్లింలు స్థానిక లింగగిరి రోడ్‌లో ఉన్న ఏదిగా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు వారిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగని నాగన్న మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ మాజీ సర్పంచ్ గొట్టే వెంకట్రామయ్య ఆదర్శ రెడ్డి ముషం సత్యనారాయణ జక్కుల మల్లయ్య సైదులు మాజీ జెడ్పిటిసి గల్లా వెంకటేశ్వర్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఐ



పట్టణంలోని ఈద్గ వద్దా పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులకు స్థానిక ఎస్సై ముత్తయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, నవాబ్ జానీ, మౌలాలి, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట:

రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా లో నమాజ్ ముగిసిన అనంతరం ముస్లిం సోదరులకు



మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, పర్యాటక డెవలప్ మెంట్ శాఖ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు వేర్వేరుగా ఈద్ ముబారక్ చెప్పారు. ఈ సందర్భంగా మౌలానా అతహర్ సాహెబ్ ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.యస్పీ నర్సింహా ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్వేరో నెట్వర్క్ చిలుకూరు మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-చిలుకూరు

స్వేరో నెట్వర్క్ చిలుకూరు మండల కమిటీని ఎన్నిక చేసినట్లు జిల్లా సెక్రెటరీ మేరీగా విజయనిర్మల అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపిక చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వేరో నెట్వర్క్ మండలం కమిటీ అధ్యక్షులుగా మల్లెపంగు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినదని తెలిపారు. అనంతరం మిగతా ఫుల్ కమిటీని వీలైనంత త్వరలో నిర్మిస్తామని తెలిపారు. నూతనంగా ఎంపికైన మల్లెపంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ తన పదవికి పూర్తి న్యాయం చేస్తానని తెలిపారు.



సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వామ్యులు కావాలని తద్వారా అందరికీ ఆదర్శంగా నిలవాలని గరిడేపల్లి మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెంలో చెనగాని వెంకట నరసయ్య సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సమాజంలో తీరికలేని దైనందిక జీవితంలో ప్రతి ఒక్కరు కొద్దిగా సామాజిక సేవలో పాల్గొనాలని ఆయన కోరారు. సమాజంలో ఎలాంటి సేవ అయినా చేయవచ్చుని ద్వారా మానసిక ప్రశాంతత ఇతరులకు ఆదర్శంగా నిలిచే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. సేవ చేసే వారిని అందరూ ప్రోత్సహించి తమ వంతు బాధ్యతగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హుజూర్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, కీతవారిగూడెం పిఎసిఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, చింతకాయల సైదులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చిన్నగాని మహేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-గరిడేపల్లి

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తున్నట్లు రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కీత వారి గూడెం గ్రామంలో సోమవారం ఆయన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా 20 లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి పిఎసిఎస్ గోదాం వరకు సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంగళగిరి కృష్ణ, ముత్తినేని సుబ్బయ్య, చింతకాయల సైదులు యాదవ్, ముత్తినేని సురేష్, బాల్ దూరి అంజయ్య, ముత్తినేని సోమయ్య, షేక్ సైదా హుస్సేన్, కీత పెద్దమట్టయ్య, జుట్టుకొండ అంజయ్య, చిన్న నరసయ్య, మహేష్, వెంకటేశ్వర్లు, మీరా, కోటేశ్వరరావు, సైదా నాయక్, ఉపేందర్, వెంకట నరసయ్య సైదులు, వెంకన్న, రంగయ్య, వెంకటేశ్వర్లు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డివి దిగజారుడు వ్యాఖ్యలు

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

నవ తెలంగాణ-సూర్యాపేట



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి దిగజారుడు వ్యాఖ్యలని, ఆయన మాట్లాడే భాషతీరే ఆయనను బొందపెడుతుందని మాజీ మంత్రి, శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సీఎంపై ఫైర్ అయ్యారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్ సభలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిలో వచ్చినా మూర్ఖత్వం మారడం లేదని, అదే భాష అవే పదాలని విమర్శించారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాడని, 15 నెలలు గడిచినా కేసీఆర్ మాట లేకుండా సభ సాగట్లేదని ఎద్దేవా చేశారు. సోనియా 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారు తప్ప రేవంత్ రెడ్డి మూర్ఖత్వపు మాటలకు కాదన్నారు. కాలేశ్వరాన్ని కెసిఆర్ కు అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్లు ఇచ్చి చూపిస్తామని చెప్పిన ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదన్నారు. మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని పంట పొలాల వద్ద రైతులు కంట కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ఖరీఫ్‌లో ఎంత ధాన్యం కొన్నారు, ఎంత బోనస్ ఇచ్చారు అంటే సమాధానం లేదన్నారు. ఇంకా మూడేళ్ల అధికారంలో ఉంటారని తెలిసికూడా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు భయపడకుండా ఎండగడుతున్నారని పేర్కొన్నారు. పక్క దేశాలు చూడు.. ప్రజలు తిరుగబడితే ఎలా కూలిపోయాయో తెలుస్తుందన్నారు. గత ఏడాది కొన్న సన్న వడ్లు ఎన్ని.. ఇచ్చిన బోనస్ ఎంతో సమాధానం చెప్పాలన్నారు.రబీ ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి సమీక్షలు చేయలేదని కొనుగోలు చేస్తారా లేదా తెలియని పరిస్థితి నెలకొందన్నారు.నీళ్లు ఇవ్వమంటే రైతుల పొలాలు వేసుకోరు.. నేడు నీళ్ళు ఇస్తామని ఇవ్వకపోవడంతో వేలాది ఎకరాలు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు..ఒక తడికి ఇస్తే వేలాది ఎకరాలు పెట్టుబడి అయినా వస్తుందని చివరి భూముల వరకు నీళ్ల ఇవ్వాలని కోరారు.ధాన్యం కొనుగోళ్లపై వెంటనే ఒక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ నుంచి 9 లక్షలు క్యూసెక్కుల నీరును పారించామని గుర్తు చేశారు.కన్నెపల్లి పంప్ హౌస్ బాగానే ఉందని అధికారులు చెబుతున్నా నడిపించే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఎన్‌డియస్‌ఏ ఒక సాకుతో కాళేశ్వరం నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు నిబంధనలు తుంగలో తొక్కి నీళ్ల తీసుకుపోతుంటే ఇక్కడి ప్రభుత్వానికి సోయిలేదని ఆరోపించారు.రైతులు మేలుకోవాలని కాళేశ్వరం కొనసాగింపుకు మరో ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



నవతెలంగాణ-మునగాల

మండలంలోని తాడువాయి సింగిల్ విండోలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. సొసైటీలో రూ.50లక్షల నుంచి కోటి వరకు అవినీతి జరిగి వుండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ విషయమై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని సూచించారు. 51 ఎంక్వరీ వేసి విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా సహకార సంఘ అధికార యం త్రాంగం కూడా తక్షణమే వాస్తవాలను బయట పెట్టాలన్నారు. సొసైటీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రుణాలను సకాలంలో చెల్లించి రసీదులు పొందారని గుర్తుచేశారు. రైతుల నుంచి వసూలు చేసి సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా కాజేసారని మండిపడ్డారు. సొసైటీ అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని జిల్లా అధికారులు సస్పెండ్ చేశారని చెప్పారు. అసలు నిందితులను గుర్తించాల్సిన అవసరం వుందన్నారు. సొసైటీ లో అవినీతిని పూర్తిస్థాయిలో విచారణ చేయాలని చెప్పారు.తూతూ మంత్రంగా ఇద్దరిని సస్పెండ్ చేయడం వల్ల ఉప యోగం లేదని సిపిఎం భావిస్తుందని తెలిపారు. సహకార సంఘంలో గత కొన్నేళ్లుగా అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నా యని తెలిపారు.సంఘంలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నా సంబంధిత చైర్మన్ పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. వెంటనే పాలక వర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చైర్మన్ సంబంధిత వ్యక్తులపైన సమగ్రమైన విచారణ నిర్వహించి వారి పదవి కాలాన్ని రద్దు చేయాలన్నారు. అప్పుడే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. పెట్రోల్ బంకు నిర్మాణం పేరుతో కొంత డబ్బు అవి నీతి జరిగిందని, రైతులు చెల్లించిన సొమ్ము. ఎరువుల అమ్మకంలోనూ ఇన్సూరెన్స్ పేరుతో ఇలా పలు రకాలుగా మోసాలకు పాల్ప డ్డారని చెప్పారు. సంబంధిత అధికారులు బాధ్యుల వారిపై కఠిన చర్యలు తీసుకోని కాజేసిన సొమ్మును రికవరీ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమా వేశంలో కొక్కిరేణి సహకార సంఘం చైర్మన్ చందా చంద్రయ్య, మునగాల సహకార సంఘం మాజీ చైర్మన్ స్టాలిన్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం సంఘ డైరెక్టర్లు వెంపటి బ్రహ్మం, మారం వెంకటరెడ్డి, గండు వరమ్మ, పార్టీ మండల నాయకులు వీరబోయిన వెంకన్న,మండ వ వెంకటాద్రి,గోపిరెడ్డి వెంకటరెడ్డి, సుందరయ్య, కృష్ణారెడ్డి, సుధాకర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గన్న అప్పయ్య సేవలు మరువలేనివి

నవతెలంగాణ-చిలుకూరు



గన్న అప్పయ్య సేవలు మరువలేనివని, కమ్యూనిస్టు పార్టీ ఉన్నంతవరకు బ్రతికి ఉంటాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని సీతారామపురం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. అప్పయ్య కమ్యూనిస్టు పార్టీకి చిన్నతనం నుండే ఆకర్షితుడై తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ చిలుకూరు గ్రామ సర్పంచ్ గా నారాయణపురం గ్రామ సహకార సంఘం అధ్యక్షులుగా కమ్యూనిస్టు పార్టీ భావజాలంతో కొనసాగుతూ తన మరణం అనంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం జరిగినది చిలుకూరు మండల కార్యదర్శిగా నల్లగొండ జిల్లా నాయకుడుగా తన స్వగ్రామమైన సీతారాంపురం గ్రామంలో ఎంతోమంది పేదలకు ఇల్లు లేకపోవడంతో తన పొలాన్ని తన బాబాయిల పొలాన్ని ధారాధత్తం చేసిన మహాను బాబు అన్నారు అటువంటి వ్యక్తి లేకపోవడం పార్టీకి కార్యకర్తలకు తీరని లోటు అన్నారు ఈ కార్యక్రమంలో చిలుకూరు సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు ఎస్ కె సాహెబ్ బలి నంద్యాల రామిరెడ్డి పల్లా ఉపేందర్ గన్న అజయ్ తదితరులు పాల్గొన్నారు

సీపీఐ(ఎం) అఖిలభారత 24వ మహాసభలకు ప్రతినిధిగా ఎండి. జహంగీర్



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో జరిగే సీపీఐ(ఎం) 24వ అఖిలభారత మహాసభలకు ప్రతినిధిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రతినిధిగా వెళ్ళనున్నారు. ఏప్రిల్ 2 నుండి 6 వరకు జరిగే సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభలు భారతదేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చూపనున్నాయని, బీజేపీ మతోన్మాద, ఆర్థిక, నయా ఉదారవాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో క్షేత్రస్థాయిలో సీపీఐ(ఎం) చేసే పోరాటాలను మహాసభలలో తీసుకోనున్నారు.ఈ మహాసభలకు తెలంగాణ నుండి 34 మంది ప్రతినిధులు వెళ్తున్నారు.మొత్తం 800 మంది ప్రతినిధులతో జాతీయ మహాసభ జరుగుతుంది. మతోన్మాద, పెట్టుబడి రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష, సెక్యులర్ రాజకీయాలను బలోపేతం చేసే దిశలో చర్చ జరుగుతుందని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-బీబీనగర్

యువతక్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకులు గోలి పింగళ్‌రెడ్డి అన్నారు. బీబీనగర్ మండలకేంద్రంలో నిర్వహిస్తున్న బీబీనగర్ ప్రీమియర్ లీగ్ బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను సోమవారం నిర్వహించగా టాస్ వేసి మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రికెట్ ఆడడం వల్ల శారీరకంగా, దృఢంగా మారతారన్నారు.మానసికంగా ఏకాగ్రత పెరుగు తుందన్నారు.అందరు కలిసి ఆడటం వల్ల సమాజంలో సమ భావన పెరుగుతుందన్నారు.ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి అక్బర్, పింగళ్ అన్న సేవాదళ్ గౌరవ అధ్యక్షులు కాసుల రఘునందన్‌గౌడ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు లంచ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సై. రమేష్, మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షులు పంజల పెంటయ్యగౌడ్, పొట్ట నవీన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ప్లేయర్స్,యువకులు పాల్గొన్నారు

విషమవుతున్న నీళ్లు

అడుగంతుతున్న భూగర్భ జలాలు

- బోరు బావులు తవ్వి అప్పుల పాలౌతున్న రైతులు
- లోతుకెళ్తె విషపు నీళ్లే
- పాడవుతున్న పంట పొలాలు



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

వర్షాభావ పరిస్థితులు,వేసవి ఎండలకు భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి.ఎట్లాంటి సాగు నీరు వనరులు లేకపోవడం,మూడేళ్లుగా సరైన వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు పాతాళానికి చేరు కుంటున్నాయి.లోతుకు వెళ్తున్నా కొద్ది భూమి విషపునీళ్ళను వెళ్ళగక్కుతుంది.మండలంలో ప్రస్తుతం 500ల నుండి 1000 పీట్లు బోరు బావి తవ్వినా నీళ్ళు రాని పరిస్థితి నెలకొంది.సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు 5,10 చొప్పున బోరు బావులు తవ్వి అప్పుల పాలౌతున్నారు.సాగ చేసిన పంట పొలాలను కాపాడుకునేందుకు బోర్లు వేసి వేసి అప్పుల పాలవుతున్నారు.ఆర్థికనష్టాలకు లోనవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.300 ఫీట్ల లోతు పైబడి వచ్చిన నీళ్ళు విషంలా మారి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పొరపాటున నోట్లో పూసుకుంటే ఉప్పు,చేదు,చమురు అంటూ భరించలేని కడుపు నొప్పి వాంతు అవుతున్నాయని మండలంలోని లచ్చుచమ్మగూడెం గ్రామానికి చెందిన రైతు ఆలుగుబెల్లి అంజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.విషంనీళ్ల వల్ల తను నాటేసిన వరి పొలం ఎండిపోయి పంట భూమి పాడైందని అదే గ్రామానికి చెందిన పంతంగి సత్తయ్య అనే రైతు వాపోతున్నారు.పశువులు సైతం ఈ విషపు నీళ్ళను తాగడం లేదంటున్నారు.పంట పొలం పాడైపోవడంతో రైతులు ఈ నీళ్లను హైదరాబాదుకు చెందిన ల్యాబ్‌లో టెస్ట్ చేయించారు.ఫ్లోరిన్ శాతం ఉండాల్సిన దానికంటే 300కు పైగా ఉందని నిపుణులు తెలిపారు.మునుగోడు నియోజక వర్గం అంటేనే ఫ్లోరైడ్ ప్రాంతామని ప్రపంచమంతా తెలుసు.నియోజక వర్గంలో వందలాదిమంది చిన్నారులు ఫ్లోరైడ్ మహమ్మారికి గురై జీవచ్ఛవాళ్లుగా మారి ప్రాణాలు సైతం కోల్పోయారు.ఉన్నత న్యాయస్థానాలు సైతం ఈ ప్రాంత ప్రజలకు తాగు,సాగునీరు అందించాలని ఆదేశించినా పాలకులకు పట్టింపేలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఫ్లోరైడ్ భూతాన్ని అరికట్టలేని ఈ ప్రాంత పాలకులు భూగర్భజలాలను కలుషితం చేసేందుకు నిర్మిస్తున్న రసాయన పరిశ్రమలను సైతం నివారించలేక పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా చూసినట్లయితే నారాయణపురం మండలంలోనే అత్యధిక శాతం భూగర్భజలాలు అడుగంటిపోయినట్లు అధికారుల లెక్కలు ధ్రువీకరిస్తున్నాయి.మండలంలో గతేడాది 10.81మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు12.09 మీటర్లకు పడిపోయాయి.2023 లో 6.69 మీటర్ల ఎత్తులో ఉన్న భూగర్భజలాలు 2024 లో 10.81 మీటర్లు పడిపోగా 2025లో ప్రస్తుతం23.09 మీటర్లు పడిపోయాయి.భూగర్భ జలాలు పాతాళానికి వెళ్తున్న కొద్ది విషయంలో తయారవుతున్నాయి.మండలంలోని లచ్చమ్మగూడెం గ్రామంలో సుమారుగా 200లకు పైగా వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి.100 నుంచి 200 ఫీట్ల లోతు నీళ్ల ఉన్న బోరు బావులే ఉన్నాయి. మూడేళ్ల కరువు వల్ల 90 శాతం బోర్లు ఎండిపోయాయి.ఉన్న 10 శాతం బోర్లు పశువులకు,ఒకటీ అరమడి కి నీళ్ళు అందిస్తున్నాయి.నాలుగు ఐదు వందల ఫీట్లకు పైన బోర్లు వేసిన రైతులు ఒకరిద్దరు మాత్రమే.లోతుల్లో వచ్చిన నీళ్ల విషంలా తయారై ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి.



వరి చేనంత ఎండిపోయింది
పంతంగి సత్తయ్య లచ్చమ్మ గూడెం రైతు

తనకున్న 2.20 ఎకరాల్లో వరి పంట సాగుచేసిన నీళ్ల లేక ఎండిపోతుండడంతో నాలుగు బోర్లు వేసిన ఒక్క దాంట్లో 380 ఫీట్లలో నీళ్ల వచ్చాయి. ఆ నీళ్లను వరి చేనుకు పెడితే వారం రోజుల్లో చేనంతా చని పోయింది. సాగు భూమి అంతా ఉప్పరిల్లి పోయింది.బోరు నీళ్ల వాసనే వేరు వచ్చేది. ఉప్పు చేదు అదో రకమైన వాసన.పశువులను నీళ్లకు తోల్తే వాసన చూసి పారిపోతున్నాయి.బోర్లు వేసివేసి జేబులు ఖాళీ పొలాలు పాడవుతున్నాయి.



విషం కంటే ఘోరం
అలుగుబెల్లి అంజిరెడ్డి లచ్చమ్మగూడెం రైతు

తనకు 14 ఎకరాల భూమి ఉది.ఏడు బోర్లస్తే ఒక్కటి పోస్తుంది.బురుగు,నూనె సమర్‌లా నీళ్ల వస్తున్నాయి.నోట్లో పోసుకుంటే కషాయం మాదిరి.పొరపాటున కడుపులోకి వెళ్తే భరించలేని కడుపునొప్పి,వాంతులు అవుతున్నాయి. వరి చేనుకు పెడితే చేను చస్తది.400 ఫీట్ల లోతుల్లో నీళ్ల వచ్చాయి. గతంలో ఉన్న బోర్లు 90 నుంచి 200 మీటర్ల లోతులోనే నీళ్ల ఉండేవి.ఆ బోర్ల నీళ్ల ఉప్పు ఉండకపోతుండే.వర్షాలు లేక ఎండిపోయాయని, ఈ నెలలోపే మూడు బోర్లు వేసిన ఒక్క దాంట్లోనే నీళ్ల వచ్చాయి.ఆ నీళ్ల పశువులు తాగడం లేదు.చూసిన చుట్టూ పక్కల రైతులందరూ పరిశ్రమల వ్యర్థాల వల్ల వచ్చే నీళ్ల అంటున్నారు.



సాగు నీటి వసతి కల్పించాలి
సీపీఐ(ఎం) నాయకులు గట్టుపల్,కర్నాటి సుధాకర్

ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు లేకపోవడం వల్లనే రైతులకు ఈ ఇబ్బందులు వస్తున్నాయి. సాగునీటి సౌకర్యం కల్పించాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు.న్యాయస్థానాలు హెచ్చరించినా పాలకులకు, ప్రజాప్రతినిధులకు పట్టింపేలేదు.విషపునీళ్లతో అల్లాడుతున్న ఈ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించక పోను కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను స్థాపిస్తున్న పట్టించుకోవడం లేదు. చౌటుప్పల్ దివిస్ పరిశ్రమల వల్ల ఇప్పటికే పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఇది చాలదన్నట్టు గట్టుపల్-పుట్టపాక మధ్యలో మరో రసాయనిక పరిశ్రమ స్థాపిస్తున్న పట్టించుకోవడం లేదు.వెంటనే రసాయన పరిశ్రమలను నిలిపివేయాలి. స్వచ్ఛమైన సాగు తాగునీరు అందించాలి.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములు అదాని సంస్థలకు అప్పజెప్పే కుట్ర



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని అదానిసంస్థలకు అప్పజెప్పే కుట్రను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాపసు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పుకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి హెచ్‌సీయూ భూములపై పోరాడుతున్న యూనివర్సిటీ విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయించి కుట్ర పన్నుతున్నారని తెలిపారు. భూముల అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై కేసులను ఎత్తివేయాలని కోరారు.అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు.400 ఎకరాల భూమిలో పండగ రోజు సెలవు రోజుల్లో పదుల సంఖ్యలో జేసీబీలు, ప్రొక్లయిన్లతో నిర్విరామంగా చదును చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు.హైకోర్టు జోక్యం చేసుకుని తక్షణమే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిలో ప్రభుత్వం జోక్యం ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులపై అకారణంగా లాఠీచార్జి చేసి అరెస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు పూర్తిగా సంఘీభావం ప్రకటిస్తున్నట్టు తెలిపారు.తెలంగాణ సమాజమంతా విద్యార్థుల వైపు నిలబడాలని తెలిపారు.

దత్తప్పగూడెం గ్రామానికి నేడు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-మోత్కూరు

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు రానున్నట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి, రాచకొండ బాలరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని రేషన్ షాప్-6 లో సన్న బియ్యం పథకం ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, మున్సిపల్ నాయకులు తదితరులు హాజరుకావాలన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రంజాన్ పండుగ పర్వదినం పురస్కరించుకొని ఆలేరు పట్టణంలో సోమవారం దినేష్ గార్డెన్‌లో ఏర్పాటు చేసినవి ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా ఆలేరు మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బూడిద భిక్షమయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ ప్రజలన్నారు. ప్రజలందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు.అంతకుముందు 12వ వార్డులో రామ్‌శివాజీనగర్‌లోని, బీఆర్ఎస్ యువనాయకులు భిక్షమయ్య యువసేన ఆలేరు పట్టణ అధ్యక్షులు ఎండి గోరేమియా నివాసానికి చేరుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ముస్లిం మైనార్టీ యువతను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు భిక్షమయ్యగౌడ్కు ఘన స్వాగతం పలికి ,శాలువాతో సన్మానించారు. అనంతరం ముస్లిం సోదరులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు పురపాలక సంఘం మాజీ చైర్మెన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షులు పుట్ట మల్లేష్‌గౌడ్,గుండాల మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి,ఆలేరు మాజీ సర్పంచ్ చింతకింది మురళి, నాయకులుకొలుపుల హరినాథ్,ఆడెపు బాలస్వామి,పంతం కృష్ణ, పత్తి వెంకటేష్, బేతి రాములు,జింకల రామకృష్ణ యాదవ్,బీజని మధు,షరాబు సంతోష్, దయ్యాల సంపత్, పూల శ్రావణ్, ఆలేటి బాలకిషన్,ఆలేటి అజయ్, జూకంటి ఉప్పలయ్య, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని సోలిపేట గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చీర్ల రాజేశ్వర్‌యాదవ్, బీజేపీ మండల అధ్యక్షులు వినోద్‌నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నందరాజు గౌడ్, చిలువేరు సుధాకర్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, వెంకటరమణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-మోటకొండూరు

మండలంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వ అధికారులు సందర్శించాలని, అందులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు డిమాండ్ చేశారు.సోమవారం మండలంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద కాలనీ వాసులతో ముత్యాలు సంతోష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.గత ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. కాలనీలో సీసీరోడ్లు వేయాలని, చీడపురుగులకు అడ్డాగా మారిందని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని,దాని చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించి ఇచ్చింది కానీ వారికి వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మండల ప్రభుత్వ అధికారులు సందర్శించాలని, అందులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. మండలవ్యాప్తంగా ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ముత్యాలు, సంతోష్ బెల్లంకొండ లక్ష్మి, గంజి సంతోష,ముత్యాలు, మాధవి, బోళ్లపద్మ, ఉండాడి బాల నర్సమ్మ, గోరంటినరసింహ, ఏదుహేమలత, ఉండాది నరసింహ,చంద్రమ్మ, లలిత,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



భువనగిరిలో...

నవతెలంగాణ-భువనగిరి

రంజాన్ మాసం పురస్కరించుకొని భువనగిరి పట్టణం ఈద్గాలో ముస్లిములు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెలరోజుల పాటు రంజాన్ దీక్షలను ప్రార్థనలతో విరమించారు. జిల్లావ్యాప్తంగా ఈద్గాల వద్ద ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కుంభం. పట్టణంలోని ఈద్గాలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్‌మాసాన్ని పురస్కరించుకొని ప్రతిసంవత్సరం తాను ఈద్గాకు వచ్చి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసిన విషయాన్ని గుర్తుచేశారు.రంజాన్‌మాసాన్ని పురస్కరించుకొని కఠోరమైన ఉపవాస దీక్షలను పాటించడాన్ని అభినందించారు. దేశంలో లౌకికతత్వాన్ని కాపాడాలని కోరారు.ఈ సందర్భంగా కార్యకర్తల ఇంట్లో భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, గ్రంథాలయం సంస్థల జిల్లా చైర్మెన్



చౌటుప్పల్‌లో...

అవైస్ చిస్తీ, నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కూర వెంకటేష్. బీసుకుంట్ల సత్యనారాయణ, ఈరాపాక నర్సింహ, మజర్, సలాద్దీన్, ఎం.ఎ.రహీమ్. సమీర్,ఆమేర్, బుర్హాన్, సల్మాన్ ఫరూక్,బెండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

అడ్డగూడూరు : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత,మత సామరస్యానికి ప్రతీక అని అడ్డ గూడూర్ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి సందీప్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖుద్దుస్, రషీద్, ఖలీల్, ఖలిక్, యాకూబ్, మస్తాన్, మతీన్, సమీర్, రహమాన్, మస్తాన్, సత్తార్, కాంగ్రెస్ నాయకులు వల్లంభట్ల రవీందర్, పూలపల్లిసోమిరెడ్డి,రాచకొండ రమేష్, గూడపు పాండు,గూడెపు నాగరాజు, మారిశెట్టి మల్లేష్ ,సోమన్న,రవి, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

మోత్కూర్ : అసమానతలు తొలగించి,మత సామరస్యానికి, ఆత్మీయ సోదర బావాన్ని పెంచే సామూహిక నమాజ్ మాసమే రంజాన్ పండుగ అని, దాన్ని భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని ముస్లిం (కాశేవారు)సోదరులను వారి కుటుంబాలను కలిసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, మెతుకుసాయిలు, అన్నవరం వెంకటయ్య, ఎస్‌కె.కమాల్‌బాబు, బుడేంసాబ్, ఎండీ హుస్సేన్, సలీమ్, మహబూబ్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలో ఈద్-ఉల్-ఫితర్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక నమాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ అబ్దుల్ సమద్ ముఫ్తి, మసీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం అలీ, ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ అలీ పుల్లా, సయ్యద్ సాదిక్, సయ్యద్ అజ్జు, మహమ్మద్ జహంగీర్, సయ్యద్ ఎజాస్, రసూల్, సయ్యద్ అబ్బాస్, నదీమ్, అన్వార్, జమీల్, అక్బర్, హైమద్, షేక్ జహంగీర్, వహీద్, గాలిబ్ సాహెబ్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీలో ముస్లిమ్‌లు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిములు నూతన వస్త్రాలు ధరించి ఉదయం నుండే ఈద్గా, మజీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్



యాదగిరిగుట్టలో...

మాజీ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ అధ్యక్షులు బొబ్బిళ్ల మురళి, గంగరామ్‌లు ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయాన్ష్ భార్గవ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు ఈ వేడుకలకుప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుల్లపల్లి భరత్ ,ముక్కెర్ల మల్లేశం బందారపు భిక్షపతి,బరిగెల రామచందర్, బూడిది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండలకేంద్రంలోని మైనార్టీ కాలనీ సమీపంలో ఉన్న ఈద్గాలో,మండలంలోని ముస్లిం సోదరులందరూ పాల్గొని ప్రత్యేక సామూహిక నమాజ్ నిర్వహించారు.అనంతరం అలీ సహాబ్ గుట్ట క్రింద ఉన్న కబ్రస్థానంలోకి వెళ్లి తమ పూర్వికుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు అలాయి బలై తీసుకున్నారు. ఈద్గా దగ్గరికి హిందువు సోదరులు తరలివచ్చి వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆ లింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ నిగిడాల వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు సాల్వేర్ అశోక్, జినుకల ప్రభాకర్, జెల్ల వెంకటేష్, గోదాసు పృథ్వీరాజ్, రామిని రమేష్, కందుల హనుమంతు, కొమ్ము శేఖర్, కొత్తపల్లి అబ్రహం కుమార్, గొలుసుల ప్రసాద్, కోట సుధాకర్, ఎండి జమీరోద్దీన్, ఎస్.కె చాంద్, ఎండి అక్రమ్, ఎంఏ మజీద్, వహెద్, ఎండి నాసర్, మీర్ ఏజాస్ ఖాన్, హబీబొద్దీన్, వహీద్, బషీర్ బేగ్, ఇనాయతుల్ల బేగ్, తదితరులు పాల్గొన్నారు



రామన్నపేటలో...



మోత్కూర్‌లో...



అడ్డగూడూరులో...

అత్యంత భక్తి శ్రద్ధల నడుమ ఈద్-ఉల్-ఫితర్ సామూహిక ప్రార్థనలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెలరోజులు ఎంతో నిష్ఠతో గడిపిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి.సోమవారం యావత్ భారతదేశం జరుపుకున్న ఈద్-ఉల్-ఫితర్ లో



భాగంగా నార్కట్‌పల్లిలోని ఈద్గాలో మండలంలోని వివిధ గ్రామాల నుండి విచ్చేసిన ముస్లిం సోదరులు స్థానిక ముస్లిం సోదరులు అందరూ కలిసి చిన్న -పెద్ద ధనిక-పేద తారతమ్య భేదం లేకుండా సామూహికంగా ప్రార్థనలు (నమాజ్) చేశారు. ప్రార్థనల అనంతరం కులమతాలకతీతంగా ఈద్గా వద్దకు చేరుకున్న వివిధ పార్టీల నాయకులు స్థానిక హిందూ సోదరులు, ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ముస్లిం మత పెద్దలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన బత్తుల ఊషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో స్థానిక ఈద్గా వద్ద సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన సామూహిక ప్రార్థనలు చేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలఅధ్యక్షులు బత్తుల ఉషయ్య, జిల్లా నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ నుస్రత్‌అలీ, షేక్ అహ్మద్,పన్నాలఅంజిరెడ్డి,బాబర్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దాడి అప్రాజస్వామికం

- యూనివర్సిటీ భూముల వేలాన్ని వెంటనే ఆపాలి
- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్

నవతెలంగాణ-రామన్నపేట

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి వేలాన్ని ఆపాలని ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై



పోలీసుల దాడి చేయడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడపడానికి విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీల భూములను వేలం వేయడం హేయమైన చర్య అన్నారు. దీన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.వందలాది బుల్డోజర్లతో పచ్చని అడవిని నాశనంచేసి కార్పొరేట్లకు కట్టబెడితే విద్యార్థులు ఊరుకోరని హెచ్చరించారు.ఓవైపు తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ కేంద్రమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసన కార్యక్రమాలకు అనుమతించకుండా మరోవైపు సెంట్రల్ యూనివర్సిటీలో భూములను అమ్మడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు.6 గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యం అని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ సర్కార్ ప్రజాస్వామ్యతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై కిరాతకంగా దాడి చేసి పోలీసులను ప్రయోగించడం సరికాదన్నారు.వెంటనే భూముల వేలాన్ని ఆపాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మేకల శివకుమార్, అజయ్ బత్తిని సందీప్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

24వ జాతీయ మహాసభలకు సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా నాయకులు

నవతెలంగాణ-క్లాక్‌టవర్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 24వ మహాసభలు మదురైలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు జరుగనున్న సభలకు నల్గొండ జిల్లా నుండి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి బయల్దేరారు.ఈ సందర్భంగా నల్గొండ దొడ్డికొమురయ్య భవనం వద్ద వారు మాట్లాడారు.మూడేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం రైతులను కార్మికులను మహిళలను వంచిందన్నారు.బడాబూర్జువా పెట్టుబడిదారులకు దేశ సంపద ను దోచిపెట్టిందని పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతల సమస్య తీవ్రంగా పెంచిందని, కులం పేర, మత పేరం, ప్రాంతం పేర ప్రజలను చీల్చే కుట్రలకు పాల్పడిందని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.రాష్ట్రంలో ఆర్థికమాంద్యం ఏర్పడిందన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు.ప్రభుత్వాలు కనీసం ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించడం లేదని తెలిపారు.భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించడానికి ఈ మహాసభలు దిశా నిర్దేశం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.అంతిమంగా ఈ దేశం కోసం నిలబడిందన్నారు.ఈ దేశం భవిష్యత్తు కమ్యూనిస్టుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ మహాసభల్లో ప్రజలు స్థితిగతులు చర్చించి భవిష్యత్తు పోరాటాలను కర్తవ్యాలను నిర్దేశించుకోవడం



జరుగుతుందని తెలియజేశారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

రాజీవ్ యువ వికాస్ పథకానికి ..

అర్హులంతా దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 5, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. 50 వేల రూపాయల లోపు రుణం వందశాతం మాఫీ, లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం మాఫీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుంది. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లోన్ల ద్వారా అందిస్తారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు.ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రేంజ్ రోవర్ కారు దగ్ధం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

కోటి 80 లక్షల విలువగల కారు రోడ్డుపై ప్రయాణిస్తూ ఒకేసారి కారులో నుంచి పొగలు,మంటలు చెలరేగి కారు దగ్ధమైన సంఘటన సోమవారం మండల పరిధిలోని చెరువుగట్టులో గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆర్చి ఎదురుగా చోటుచేసుకుంది. కారు యజమాని వై.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...టీఎస్ 09ఇ జే9699 గల నెంబర్ గల రేంజ్ రోవర్ కారు గుంటూరు నుంచి హైదరాబాద్‌కు కారులో ముగ్గురు కలిసి ప్రయాణం చేస్తున్నారు. చెరువుగట్టు సమీపానికి చేరుకోగానే కారులో నుంచి పొగలు రావడం గమనించారు. దీంతో హుటాహుటిన కారులో నుంచి కింది దిగారు. కారులో నుంచి పొగలు వస్తూనే మంటలు చెలరేగాయి. 15 నిమిషాల్లో పూర్తిస్థాయిలో కారు దగ్ధమైంది.కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కిందికి దిగి పరిశీలించగా కారులో నుంచి పెట్రోలు లీకైనట్టు రోడ్డుపైన 50 మీటర్ల దూరం వరకు తడిగా ఉండడం గమనించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల బాధలు,ఆలయ అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం

- 4న ఎర్రవెల్లికి రైతులతో వెళ్లి కలుస్తాం
- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఏప్రిల్ 4వ తేదీన గజ్వేల్ లో ఎర్రవెల్లి లో గల తన నివాసంలో బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ నాయకులు, రైతులు కలిసి రైతుల బాధలు, ఆలయ అవినీతిని వివరిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య వెల్లడించారు.బీఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆలేరు నియోజకవర్గంలో ఏర్పడిన కరువుతో పాటు యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపైన కెసిఆర్ ను కలిసి వివరించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలంతా మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఈ అంశంపై కెసిఆర్ తోనే నేరుగా రైతులు చెబుతారన్నారు. త్వరలోనే యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి కేసీఆర్ రావాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆహ్వానించనున్నట్లు చెప్పారు.ఈ పాదయాత్రను మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డిలు యాదగిరిగుట్ట శ్రీ స్వామివారి వైకుంఠద్వారం వద్ద ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీద రవీందర్‌గౌడ్, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, యూత్ అధ్యక్షులు ముక్కెర్ల సతీష్‌యాదవ్, నాయకులు కొన్యాల నర్సింహారెడ్డి, గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్, దేవపూజ అశోక్, శారాజీ రాజేష్ తదితరులున్నారు.



గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని కాజీపేట గ్రామ శివారులో ఉన్నటువంటి షామీర్ పేట వాగులో గుర్తుతెలియని శవం లభ్యమైన ఘటన సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్సై శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం కాజీపేట గ్రామ శివారులో షామీర్పేట్ వాగులో గుర్తుతెలియని (30టి35) వాగులు పడి వ్యక్తి మృతి చెందినట్లు డొంకెన కిష్టయ్య వ్యవసాయ భూమి పక్కనే గల వాగు, పోలీసుల సమాచారం అందజేయడంతో స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి పరిసరాలను పరిశీలించారు. ఈత కోసం వెళ్లి మృతి చెందాడా? లేక ఎవరైన హత్య చేసి చెరువులో పడేశారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్లని ప్యాంట్, నలుపు పైన పెసర రంగు షర్ట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

విశ్వవిద్యాలయాల భూముల వేలం ఆపాలి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

విశ్వవిద్యాలయాల భూముల వేలంను వెంటనే ఆపేయాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దొంతగోని అమరేందర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.భూముల వేలం ఆపాలని కోరుతున్న హైదరాబాద్



సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను నిర్బంధించిన పోలీసులపై చర్య తీసుకోవాలన్నారు.రంగారెడ్డి జిల్లాలో ఉన్న యూనివర్సిటీ భూములపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కన్ను పడిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3నెలల్లోనే రాజేంద్రనగర్‌లో ఉన్న అగ్రికల్చర్ యూనివర్సిటీ భూమిని హైకోర్టు కోసం కేటాయించారన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400ఎకరాల భూమి వేలం వేస్తున్నారన్నారు.ప్రభుత్వభూములను కార్పొరేట్లకు అప్పజేప్పేందుకు విజ్ఞానవంతులను తీర్చిదిద్దాల్సిన విద్యా లయాల భూములే కావాల్సి వచ్చిందా అని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రామోజీ సిటీ యాజమాన్యం కాజేయాలని చూస్తున్న 370 ఎకరాల భూమిని కాపాడాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విశ్వ విద్యా లయాల భూమినను వేలం వేయకుండా ఆపాలన్నారు.భూముల వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.



భువనగిరిలో...





భువనగిరిలో..

రంజాన్ పండుగ దృశ్యమాలిక



భువనగిరిలో...



భువనగిరిలో...

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మాత సామరస్యాని కి ప్రతీక రంజాన్ పర్వదినం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు మండలకేంద్రంలో సోమవారం దర్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పని చేస్తుందన్నారు. హిందూ ముస్లిములు సోదరభావంతో అలాయి, బలాయి తీసుకున్నారు. అనంతరం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పట్టణంలోని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎజాజ్ ఇంటికి వెళ్లి విందు ఆరగించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ కొండలరావు, ఎస్సై రజనీకర్, పట్టణ మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
మంగళవారం | ఏప్రిల్ 01, 2025 | www.navatelangana.com



ఇరువర్గాల మధ్య ఘర్షణ

నవతెలంగాణ-చింతలపాలెం

కాంగ్రెస్ పార్టీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి 15 మందికి గాయాలయిన ఘటన మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో చోటుచేసుకుందని ఎస్సై అంతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులతో మొదలైన గొడవ కాస్త రెండు గ్రూపుల పరస్పర దాడి తీసింది. ఆదివారం రాత్రి పది మంది యువకులు గొడవ పడుతుండగా ఒక వ్యక్తి వారికి నచ్చచెప్పడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. ఆ విషయం పెద్ద వారికి తెలియడంతో ఒకరి పై ఒకరు గొడవకు దిగి, కర్రలతో, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో 15 మందికి గాయాలు కాగా, 6 ఇండ్లు ధ్వంసం, 5 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి.కొందరికి బలమైన గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘర్షణకు కాంగ్రెసు పార్టీలో సాగుతున్న ఆధిపత్య పోరు కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఎలాంటి దాడులు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి చెప్పారు. నిందితులను గుర్తించి కేసు నమోదు చేస్తామని అన్నారు.

11వ తేదీన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు పట్టణంలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను ఏప్రిల్ 11న నిర్వహించనున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా క్రీడా మైదానంలో స్థల పరిశీలన చేశారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎస్సై రజినీకర్, కానుక బాలరాజు, బలరాము తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిముల పాత్ర మరువలేనిది
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయప్రతినిధి

నల్లగొండ జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గాలో పవిత్ర రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేశారు.జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాటంలో ముస్లిముల పాత్ర మరువలేనిదన్నారు. దేశాభివృద్ధికి ఎంతోమంది ముస్లిములు కృషి చేశారని, అందులో అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, సైంటిస్ట్ గా చేసిన సేవలు మరువలేనివని చెప్పారు.నల్గొండ జిల్లా మతసామరస్యానికి పేరని, హిందూ ముస్లిములంతా కలిసి నల్గొండ పట్టణాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు సహకరించాలని





పిలుపునిచ్చారు.నల్గొండలో శాంతిభద్రతలు బాగుండాలని, హిందూ, ముస్లిములంతా కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నారు.నల్గొండ పట్టణంలోని దర్గాలు ఈద్గాల అభివృద్ధికి తాను 25 ఏండ్ల నుండి కృషి చేస్తున్నానని తెలిపారు.ఇక్కడి ఈద్గా తెలంగాణలోనే అతిపెద్ద ఈద్గా అన్నారు. ఇటీవల నల్గొండలో నిర్వహించిన ఇస్తేమాలో సుమారు 40,50 వేల మంది పాల్గొన్నా సమస్య లేకుండా తాగునీరు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా లతీఫ్‌సాబ్ దర్గాకు ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు ,ఇతర ఉత్సవాల సందర్భంగా లక్షల మంది వస్తారని, పెద్దవారు, ముసలివారు గుట్ట ఎక్కలేరని, దీన్ని దృష్టిలో ఉంచుకొని లతీఫ్‌సాబ్ దర్గాకు రూ.100 కోట్ల తో ఘాట్ రోడ్ నిర్మిస్తున్నామని, టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.లతీఫ్ సాప్ గుట్ట నుండి బ్రహ్మంగారి గుట్ట వరకు రోప్ వే నిర్మిస్తున్నామని, బ్రహ్మంగారి గుట్టకు కూడా వేరే ఘాట్‌రోడ్ వేయిస్తున్నామని చెప్పారు.రూ.500 కోట్లతో కొత్త బైపాస్ రోడ్ టెండర్లు వేయడం జరిగిందని, వారం రోజుల్లో పనులు మొదలవుతున్నాయన్నారు.నల్లగొండలో ముస్లిముల సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, కలెక్టరేట్ తదితర ప్రభుత్వ సంస్థలలో అవుట్‌సోర్సింగ్, కాంటాక్ట్ పద్ధతిపై అర్హులైన ముస్లిం అభ్యర్థులను నింపేందుకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేలా జిల్లా కలెక్టర్‌కు ఇదివరకే ఆదేశించామని వెల్లడించారు. దీంతో పాటు పేద ముస్లిములకు ఇండ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నల్గొండ పట్టణం సమీపంలో పేదవారికి ఇండ్ల నిర్మాణానికి భూమిని గుర్తించామన్నారు.ప్లాట్లు లేని వారికి ప్లాట్లు ఇచ్చి రూ.5 లక్షలతో ఇండ్లు కట్టిస్తామని, ప్లాట్లు ఉంటే నేరుగా ఇండ్లు కట్టించడం జరుగుతుందని చెప్పారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లాలో హిందూ, ముస్లిములందరూ సోదర భావంతో ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనపహాడ్:

మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ అని, బీఆర్ఎస్ పార్టీ మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ మస్తాన్ అన్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం మండలంలోని ముస్లిములు ఈద్గాలో ప్రార్థనలు జరిపినారు. ఈ సందర్భంగా వారికి షేక్ మస్తాన్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతారంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న తరువాత ఆయన మాట్లాడుతూ రంజాన్ పండగ పవిత్రతకు త్యాగానికి చిహ్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి షరీఫ్, షేక్ చాంద్, హుస్సేన్, అక్బర్, జానీ, షఫీ,ఉస్మాన్,ఖాదర్, సాజిద్, యాకూబ్, మదర్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన యుగంధర్..

రంజాన్ పండుగ సందర్భంగా దోసపహాడ్ గ్రామంలోని ఈద్గా వద్ద జరుగుతున్న నమాజ్ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో షేక్ అమ్రెల్లి కాసిం, షేక్ పెద్దమనిషి కాసిం, షేక్ మల్లెపూల సైదా, చిన్న కాసిం, షేక్ రసూల్ సైదా, షేక్ రసూల్, షేక్ జామియా, షేక్ బిక్షన్ ఇతర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి :

మండలంలోని పొనుగోడు, కీత వారి గూడెం గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొనుగోడులో ఈద్గా వద్ద ముస్లిం సోదరులు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సహకార బిల్లును వ్యతిరేకిస్తూ గ్రామంలో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. కీతవారిగూడెంలో మాజీ ఎంపిటిసి చాంద్ మియా ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ వేడుకలలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ కే జానీ నాగుల మీరా, రఫీ, మతిన్, నజీర్, సైదా తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం దరఖాస్తులకు గడువు పొడగింపు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకుగాను ఏప్రిల్ 14 లోగా మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో మాన్యువల్ గా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారీలు రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,అధికారులతో రాజీవ్ యువ వికాసం పై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం అమలలో భాగంగా నల్గొండ జిల్లాలో దరఖాస్తుల పరిస్థితిని జిల్లా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రి కి వివరిస్తూ రాజీవ్ యువ వికాసం కింద ఇప్పటి వరకు 22,356 దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందని తెలిపారు.నల్గొండ ,మిర్యాలగూడ ల నుండి ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకించి రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించేందుకుగాను, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో ఖాళీ దరఖాస్తు ఫారాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఇప్పటివరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అన్ని దరఖాస్తుల ప్రింట్ కాపీలు తీసి సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి సందేహాల నివృత్తికి గాను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 18004251442 ను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు నల్గొండ జిల్లాలో ఎస్ సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజీవ్ యువ వికాస పథకంపై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు 10 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి నిరుద్యోగ ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనారిటీ, ఓబీసీ ,ఈ బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ పథకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అమలు చేయాలని, క్షేత్ర స్థాయి వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పథకం విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. అలాగే జిల్లా మంత్రులు ,శాసనసభ్యులతో రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించి ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. యువత వారి కాళ్లపై వారు నిలబడి స్వయం ఉపాధి పొందెందుకు ఇది చక్కటి అవకాశం అని, అందువల్ల ఈ పథకంలో పని చేసే ప్రతి ఒక్కరు మనసుపెట్టి పనిచేయాలని, రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే తేదీని పొడిగించాలని క్షేత్రస్థాయి నుంచి వచ్చిన అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకునే తేదీని పొడగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకం కింద అర్హత పొందిన లబ్ధిదారులకు జూన్ 2న సాంక్షన్ ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆన్లైన్లో దరఖాస్తుల ను స్వీకరించడంలో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు గాను అన్ని మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో మాన్యువల్ గా దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. ఆన్లైన్ పోర్టల్ నుండి కేవలం ఖాళీ దరఖాస్తులు మాత్రమే డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఇకపై ఎలాంటి అప్లికేషన్లను ఆన్లైన్లో అనుమతించవద్దని, ఇదివరకు ఆన్లైన్ ద్వారా స్వీకరించిన అన్ని దరఖాస్తుల కాపీలను ప్రింట్ తీసి ఉంచుకోవడంతోపాటు ,డేటా ఎంట్రీ చేయాలని చెప్పారు. ఇకపై రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తులను మండల ప్రజా పాలన సేవ కేంద్రాలలో తీసుకోవాలని, దరఖాస్తులను పూర్తిచేసి మండల ప్రజా పాలన కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలోని ప్రజాపాలన కేంద్రాలలో ఇవ్వాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ, ఓ బి సి, ఈ బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నప్పటికీ అవి సరైన విధంగా అమలు కావటం లేదని, అందుకే రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని, రాజీవ్ యువ వికాస పథకం లో నాణ్యతను ఏ విధంగా పెంపొందింప చేయాలో జిల్లా కలెక్టర్లు ఆలోచించాలని, ఈ పథకం కింద ఏర్పాటు చేసిన యూనిట్లు శాశ్వతంగా ఉపాధి పొందేలా ఉండాలని ,ప్రతి జిల్లాలో ఈ పథకాన్ని ప్రత్యేకంగా ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు అధికారిని నియమించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, తదితరులు సూచనలు, సలహాలు చేశారు. అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి, ఇతర అధికారులు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

దేశ సంపదను దోచిపెట్టడంలో భాగంగానే ఛత్తీస్‌ఘడ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు

ఇందిరా పార్కు వద్ద ధర్నా విజయవంతం కోరుతూ పోస్ట్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆలేరుటౌను



ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్రీకృతమై ఉన్న కోట్లాది రూపాయల విలువైన అటవీ ఖనిజ సంపదను అదానీ, అంబానీ లాంటి బడా కార్పోరేట్ సంస్థలకు యథేచ్ఛగా దోచిపెట్టడానికి, ఆటంకంగా ఉన్న ఆదివాసీలను, మావోయిస్టులను చంపడమే లక్ష్యయంగా ఎంచుకొని ప్రాణాలతో ఉన్న ఆదివాసీ బిడ్డలను,ప్రజల కోసం పోరాడుతున్న,అడవి ప్రాంత ప్రజలకు అండగా ఉన్న మావోయిస్టులను, కమ్యూనిస్టు విప్లవకారులను, ఆపరేషన్ కగార్ పేరుతో పట్టుకొని క్రూరంగా కాల్చిచంపి ఎస్ కౌంటర్‌లు అని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆపరేషన్‌కగార్ పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను కాల్చిచంపడాన్ని తక్షణమే ఆపాలని ఏప్రిల్ 8న సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ప్రజాధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విప్లవోద్యమాన్ని నిర్మూలించడం మోడీ, అమిత్‌షా ల తరం కాదని తెలిపారు.ఇలాంటి వాళ్ళు చరిత్ర చెత్త బుట్టలో కలిసిపోవడం తథ్యమని,తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్లు అవసరమని,వాళ్లుంటేనే బాగుంటుందని మాట్లాడిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మోడీతో కుమ్మక్కై అన్నలను చంపుతున్నాడని ఆరోపించారు. పాలకవర్గాల విధానాలన్ని ఒకే తాను గుడ్డలని, వారి జెండాలు మాత్రమే వేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్లెపు అడివయ్య, బేజాడికుమార్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు మారుజోడు సిద్దేశ్వర్, ప్రజాసంఘాల నాయకులు మామిడాల బాల మల్లేష్,గడ్డం మంకయ్య, తలారి వెంకటేష్, కుర్రి సత్యనారాయణ,చింతకింది సత్యనారాయణ, ఇరుగదిండ్ల రాములు, కల్లెపు చంద్రయ్య, ఇక్కిరి రాజు పాల్గొన్నారు.



గంజి నారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు చూడి కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నూతనకల్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గంజి నారాయణ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు చూడి కృష్ణారెడ్డి అన్నారు.సోమవారం మండలపరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నారాయణ సంస్కరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ బాల్యదశ నుండి ఆయన సీపీఐ(ఎం) పోరాటాలకు ఆకర్షితులై పార్టీ బలోపేతం కోసం అను నిత్యం కృషి చేశారన్నారు.ఆయన పోరాట చరిత్రలో నేటి యువతస్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కే.యాదగిరిరావు, మండల నాయకులు బత్తుల జనార్ధన్, బొజ్జ శ్రీనివాస్,బత్తుల తిరుమలేష్, సూడి దేవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మందుల సామేలుకు మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న

నవతెలంగాణ-నూతనకల్

కాంగ్రెస్ జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న , తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు దళితుడు నియోజకవర్గ చరిత్రలోనే. 52 వేల ఓట్ల భారి మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే మందుల సామేలుకి క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న కాంగ్రెస్ అధిష్టానాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికుడు నియోజకవర్గంలో సుమారు 24 సంవత్సరాలు తిరిగి ప్రజల కష్టసుఖాలను ఎదిగిన మనిషిగా అతను నియోజకవర్గం ఏర్పడిన నాటి వరకు ఎవరు సాధించని భారీ మెజార్టీ సాధించినందుకు గుర్తింపుగా అధిష్టానం మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జనాభాలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు దాదాపు 33 లక్షల పైగా ఉన్నారని జనాభా ప్రాతిపదికపై సామెల్ కి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో గడిచినా 13 నెలల కాలంలోనే 1400 కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి చేసిన ఘనత ఆయనదే అని అన్నారు నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం అసెంబ్లీలో సమస్యలను లేవనెత్తుతూ నియోజక విద్యవైద్యా, వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలని లక్ష్యసాధనతో ఆయన కృషి చేస్తున్నారని అన్నారు అను నిత్యం నియోజకవర్గాన్ని పర్యటిస్తూ పలు ప్రభుత్వ కార్యాలయాన్ని తనిఖీ చేస్తూ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం ఉన్నత అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు ఈ ప్రాంతంలో ఉన్న కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం అనునిత్యం అసెంబ్లీలో చర్చించడం సామలకే సాధ్యమని అన్నారు నియోజకవర్గ ంలోని అన్ని గ్రామాలు ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉన్న అతనికి మంత్రి పదవి ఇచ్చి రాష్ట్రం తో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు.

విద్యుద్ఘాతానికి గురైన రైతుకు పరామర్శ

నవతెలంగాణ-నూతనకల్



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్తు లోవోల్టేజ్‌తో తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు ఏర్పడడంతో రైతు కొనతం కృష్ణారెడ్డి ట్రాన్స్ఫారం ఫీజు వేసే సమయంలో విద్యుత్ షాక్ గురై తీవ్ర గాయాల పాలైన ఘటన మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఆదివారం చోటు చేసుకుంది. సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఏఎంసీ మాజీ డైరెక్టర్ బిక్కీ బుచ్చయ్య హాస్పటల్లో పరామర్శించి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ జనాలు అందించకపోవడంతో పాటు విద్యుత్తును పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని వారు అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి అంతరాయం లేకుండా పూర్తిస్థాయిలో విద్యుత్ ను సరఫరా చేయాలనుకోరారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాణాల సత్యనారాయణ రెడ్డి, బత్తుల గురవయ్య, అధికార ప్రతినిధి బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్ కుమార్,గ్రామ శాఖ అధ్యక్షులు పులుసు లింగ మల్లయ్య, తోట్ల శీను బత్తుల వెంకన్న,బత్తుల గాంధీ, తొట్ల బాలమల్లు తదితరులు ఉన్నారు.



కృత్రిమ కూల్‌డ్రింక్స్ నిషేధానికి జేవీవీ కృషి అభినందనీయం

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జాని

నవతెలంగాణ-నకిరేకల్

కృత్రిమ కూల్ డ్రింక్స్ నిషేధానికి జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని హైదరాబాద్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ మక్బూల్ జాని పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్బోనేటెడ్ శీతల పానీయాలను మానేద్దాం-సహజ పానీయాలను సేవిద్దాం అంటూ జెవీవీ ప్రచారంతో ప్రజలు చైతన్యం కావాలన్నారు. కూల్‌డ్రింక్స్‌తో అనారోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టం జరుగుతుందని చెప్పారు. కూల్‌డ్రింక్స్ సంస్థల మాయలో ప్రజలు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, వేదిక సైన్స్ జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వంటెపాకనగేష్, పర్యావరణ పరిరక్షణ వేదిక బాధ్యులు చల్లోజు శ్రీనివాస్, బుడిగ సుధాకర్, మూడుదుడ్ల శేషగిరి, రేపాల శ్రీనివాస్, ఎండి ఫహీమ్, అజీమ్, రెహమాన్, అక్బర్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో ప్రజాధర్నా పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-నకిరేకల్

చత్తీస్‌ఘడ్‌లో ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని ఈనెల 8న హైదరాబాదులో సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నాలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి కోరారు. పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో ప్రజాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు బండారి వెంకన్న, పిట్టల అనిల్, పోలెపవన్, నగేష్, కోటి, రాములు, రామయ్య, రంగయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

గ్రామీణ కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

- సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్



గ్రామీణ కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలని చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి పట్టణకేంద్రంలోని కచ్చీరు వద్ద విశ్వవసు ఉగాది సందర్భంగా గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి దశమ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణ యక్షగాన బృందం వెంకిర్యాల వారిచే శ్రీ రేణుకా ఎల్లమ్మ చరిత్ర యక్షగాన ప్రదర్శన నిర్వహించారు. ఎల్లమ్మ చరిత్రను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలివచ్చారు. చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మాజీ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజుతోపాటు పలువురు ప్రముఖ యక్షగాన కళాకారులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి సైదులుగౌడ్, అధ్యక్షులు గ్యార కిష్టయ్య, ప్రతినిధులు ఎరుకలి మల్లేశ్‌గౌడ్, పోలోజు శ్రీధర్‌బాబు, దొడ్డి రాములు, బడుగు బాలరాజు, శ్రీరాములు, చిక్క నర్సింహా, డాక్టర్ శ్వేత ప్రియాంక సుధీర్, డాక్టర్ జెల్ల రమేష్, సుర్వి నర్సింహాగౌడ్, చింతకింది అంజయ్యగౌడ్, బొంగు జంగయ్య, బొబ్బిళ్ల మురళి, గోశిక స్వామి, బడుగు లక్ష్మయ్య, ముత్యాల భూపాల్‌రెడ్డి, వీసం చంద్రారెడ్డి, చెవగోని వెంకటేశ్‌గౌడ్, పోలోజు రాజు, పాశం రామరాజు, బొడిగె ప్రభాకర్‌గౌడ్, ఉప్పల కృష్ణగుప్త పాల్గొన్నారు.

వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను సోమవారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ముత్యాల హనుమంతరెడ్డి మాట్లాడుతూ వైద్యుడు దేవునితో సమానమనే సూక్తిని నిజం చేసే విధంగా ఈ వృత్తిని ఎంచుకొన్న ప్రతి ఒక్కరూ రోగులకు చక్కటి వైద్యసేవలు అందించాలన్నారు. సేవాదృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. వైద్య సేవలను డబ్బుతో ముడిపెట్టకుండా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మండలోజు సుభాశ్‌చంద్రచారి, వనం రాజు, అయ్యాడపు ప్రతాప్‌రెడ్డి, కొంపల్లి వెంకట్‌రెడ్డి, ముటుకులోజు ప్రభాకరచారి, వీసం నర్సింహారెడ్డి, బొడ్డు సంజీవరెడ్డి, దాసోజు సంపూర్ణచారి, దేవరకొండ భూపాల్‌చారి, కాట్రగడ్డ శ్రీనివాస్, ముటుకులోజు సదానందం, కొత్త వెంకటేశ్, సూరోజు సత్యనారాయణ, కొయ్యడ వెంకటేశ్‌గౌడ్, అంబటి శ్రీనివాస్, ఏనుగు సత్తిరెడ్డి, పోలోజు శ్రీనివాస్‌చారి, నల్ల పర్వతాలుయాదవ్, వీరమల్ల సూర్యనారాయణ, చెరుకు మల్లేశ్‌గౌడ్, ముత్యాల రామనర్సమ్మ, వనం మమత, పోలోజు శ్రీలత, బైరు మహేశ్వరి, దివ్య, జ్యోతి పాల్గొన్నారు.